క్లుప్తంగా

బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చిత్తూరులోని డీఎస్‌ఏ స్టేడియంలో అండర్–19 బేస్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ యూ–19 కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఇంటర్ చదివే బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీ ఈడీకి సత్కారం



చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న మజ్దూర్ యూనియన్ నేతలు

తిరుపతి అర్బన్ : జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఈడీగా విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లిన తిమ్మాడి చెంగల్‌రెడ్డిని శనివారం ఘనంగా సత్కరించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆర్టీసీ మజ్దూర్ యూనియన్‌కు చెందిన నేతలు గజమాలతో సన్మానించి, శ్రీవారి ప్రతిమను బహూకరించారు. సుమారు ఏడేళ్లపాటు జిల్లాలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ బీఎస్ బాబు, నాయకులు పెరుమాళ్, చెంచులయ్య, శేఖర్, గుణశేఖర్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు బ్రహ్మోత్సవ ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు ఈఓ శ్యామలరావు ఆహ్వానించారు. శనివారం ఈ మేరకు ఆహ్వాన పత్రికను తిరుపతి శ్రీ పద్మావతీ అతిథి గృహంలో చైర్మన్‌కు అందించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ శ్రీధర్ పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి



ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న పాఠకులు

చంద్రగిరి : గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. శనివారం పాతపేట లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. లైబ్రేరియన్ రెడ్డెమ్మ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకులను ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని శనివారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ అధ్యాపకులుగా ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ ఆర్ ఉష, ప్రొఫెసర్ టి.సీతా కుమారికి అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : నగరంలోని కరకంబాడి రోడ్డులో ఉన్న ఎస్వీసీఈ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో బీటెక్, పీజీ చదివిన వేల మంది విద్యార్థులు దేశ, విదేశాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు.

మల్టీ మోడల్



ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి సర్వతోముఖాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. యాత్రికుల రద్దీ దృష్ట్యా శ్రీనివాస సేతు వంతెన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చింది. నగరంలో కనెక్టివిటీ రోడ్లను నిర్మించింది. ఈక్రమంలోనే తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను సైతం మల్టీ మోడల్‌గా తీర్చిదిద్దే ప్రక్రియ చేపట్టింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రూ.500 కోట్లు మంజూరు చేయించింది.అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు అసలు తిరునగరి అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసింది. ఇక మోడల్ బస్టాండ్ నిర్మాణంపై శీతకన్ను వేసింది. దాదాపు అటకెక్కించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోడల్ బస్టాండ్ నిర్మాణానికి అనుమతులు
- రూ.500 కోట్లకు ప్రతిపాదనలు
- కూటమి సర్కారు అలసత్వంతో మొదలు కాని పనులు
- ఆవేదన చెందుతున్న ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరుపతి బస్టాండ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిని విషయం విదితమే. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ పాలకులు మల్టీమోడల్ బస్టాండ్ నిర్మాణ ప్రక్రియ అక్టోబర్ లేదా నవంబర్ 1వ తేదీ నుంచి మొదలు పెడతారని మూడు నెలలుగా అధికారులు చెబుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు.



తిరుపతి బస్టాండ్, (ఇన్‌సెట్) నూతన బస్టాండ్ మోడల్

రూ.500 కోట్లతో చేపట్టేలా ప్రణాళిక..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు ఉన్న ప్రాముఖ్యత, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎంపీతో పాటు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్ర సర్కార్ అనుమతి ఇవ్వడంతో రూ.500 కోట్లతో 11 అంతస్తుల భవనాలతో వచ్చే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టడానికి నిర్ణయించారు. ఆ దిశగా డిజైన్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. 13 ఎకరాల విస్తీర్ణంలోని తిరుపతి బస్టాండ్ అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలపై నివేదిక కూడా రూపొందిచారు. బస్టాండ్ ప్రాంగణంలో భూసార, భూమి పటిష్టతపై పలు పరీక్షలు చేపట్టారు. మరోవైపు నూతన బస్టాండ్ నిర్మాణం నేపథ్యంలో ఈ బస్టాండ్‌ను తొలగించే ప్రక్రియలో భాగంగా రేణిగుంట రోడ్డు, తిరుచానూరు మార్కెట్, యూనివర్సిటీ ప్రాంతం, మంగళం ప్రాంతంలో బస్టాండ్ ఇలా నాలుగు వైపులా ప్రత్యామ్నాయంగా తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేయడానికి కూడా నిర్ణయించారు. దాదాపు ప్రక్రియ అంతా పూర్తి కావడంతో.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు చేపడతామని నాటి ప్రభుత్వంలోని పాలకులు ప్రకటించారు. అయితే ఎన్నికలు రావడంతో రెండు నెలలు జాప్యం చోటుచేసుకుంది. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. కానీ బస్టాండ్ అభివృద్ధి గురించి అసలు పట్టించుకోకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి.

ఉద్యోగులు మొర

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో మల్టీ మోడల్ బస్టాండ్ పనులు మొదలు కానున్నాయా ? లేదా ? లేక బస్టాండ్‌కు మరమ్మతులు చేయిస్తారా ? అనే విషయంపై తిరుపతి ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు విజయవాడలోని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) తిమ్మాడి చెంగల్‌రెడ్డిని రెండు రోజుల క్రితం కలిసి వివరించారు. రెండేళ్ల కిందటే మల్టీ మోడల్ బస్టాండ్ మంజూరు అయినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో పాటు, ప్రస్తుత బస్టాండ్‌లో మరమ్మతులు చేయకపోవడంతో విధుల నిర్వహణ కష్టంగా ఉందని వివరించారు.



ఈడీ చెంగల్‌రెడ్డికి తిరుపతి బస్టాండ్ పరిస్థితులను వివరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు (ఫైల్)

నాణ్యతతో తుడా టవర్స్ నిర్మాణం

తిరుపతి తుడా : తుడా టవర్స్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తుడా టవర్స్ నిర్మాణంలో వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ తుడా టవర్స్ నిర్మాణంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ప్లాన్, ఎలివేషన్ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, అడ్వైజర్ రామకృష్ణారావు, డీఈ బాషా, ఏఈ షణ్ముగం, కేసీపీ సంస్థ ఈడీ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.



నిర్మాణ సామగ్రి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

కమనీయం.. కల్యాణం

చంద్రగిరి : స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం మూలమూర్తికి రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీరామచంద్రమూర్తి, శ్రీవేణుగోపాల స్వామి వారికి అభిషేక సేవ చేపట్టారు. సాయంత్రం దీపారాధన, కల్యాణోత్సవం జరిపించారు. రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణ వేడుకలో దేవదేవేరులు

ఐతేపల్లె అభివృద్ధికి 'స్వరాజ్'

- ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ఎంపికైన పంచాయతీ
- హర్షం వ్యక్తం చేసిన సర్పంచ్ ఫాజిలా

చంద్రగిరి : మహిళా సర్పంచులను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ ప్రాజెక్టును తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కింద రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో మహిళల సుస్థిరాభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. సత్ఫలితాలు రావడంబతో దేశ వ్యాప్తంగా జిల్లాకో పంచాయతీను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేస్తోంది. ఈ మేరకు ఇటీవల కేంద్ర మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని చంద్రగిరి మండలం ఐతేపల్లె పంచాయతీని ఎంపిక చేసింది. ఇప్పటికే పంచాయతీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సర్పంచ్ ఫాజిలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ కింద విడుదలయ్యే నిధులను సద్వినియోగం చేసుకుని ఐతేపల్లె పంచాయతీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళతామని వెల్లడించారు. ఐతేపల్లెను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. ఈ క్రమంలోనే సర్పంచ్ ఫాజిలాకు స్థానికుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



oooooo

వెంకన్న సేవలో న్యాయమూర్తి



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ గోపీనాథ్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్ బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు తిరుపతి విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ వీణావాణి, సతీష్

తిరుపతి కల్చరల్: ఢిల్లీలో డిసెంబర్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి పోటీలకు తిరుపతికి చెందిన విద్యార్థులు బీ.కేతన్‌క్రిష్, పీ.బాలాదిత్య ఎంపికయ్యారు. గత రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన సీబీఎస్ఈ జాతీయ రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో తిరుపతిలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో 8వ తరగతి విద్యార్థులు ఫుడ్‌లో కెమికల్స్ డిటెక్ట్ చేసే మిషన్‌ను రూపొందించి ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రీజనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ వీ.వాణి, శిక్షకుడు సతీష్ అభినందించారు.

రామ్మూర్తి నాయుడుకి నివాళి

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద శనివారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం తెలుపుతూ టీడీపీ నేతలు నివాళులర్పించారు. 1994లో ఎమ్మెల్యేగా ఆయన విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, నేతలు నంగా బాబురెడ్డి, ప్రవీణ్, మోహన్‌నాయుడు, నాని, చిన్నబ్బనాయుడు, ఉమాపతి నాయుడు, బద్రినారాయణ, బుజ్జి, గజ పాల్గొన్నారు.

పొట్టకొట్టొద్దని వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమ పొట్టకొట్టొద్దని, మానవత్వంలో కొనసాగించాలని కార్మికులు విన్నవించారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారితే తమ ఉద్యోగాలకు ముప్పు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా చేసిన సేవలను గుర్తించకుండా తొలగించేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత కాంట్రాక్టర్ తప్పుకున్నారని, కొత్త కాంట్రాక్టర్ ఇప్పటికే 10 మంది కార్మికులను విధుల నుంచి తీసేసారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 40 మందిపై వేటుకు రంగం సిద్ధమైందని ప్రచారం సాగుతోందని వాపోయారు.

భూ కేటాయింపు రద్దుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : తిరుపతిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన భూములను రద్దు చేయాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు టి.ఓంకార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ముంతాజ్ హోటల్స్‌కు కేటాయించిన భూములను రద్దు చేయాలని, తిరుపతి పవిత్రత కాపాడాలని స్పష్టం చేశారు. ముంతాజ్ హోటల్స్‌కు జూ పార్క్ రోడ్డులో 20 ఎకరాలు కేటాయించారన్నారు.రు. ఆధ్యాత్మికతను కాపాడుతామని, తిరుమల పవిత్రతను రక్షిస్తామని ఎప్పుడూ ప్రకటించే బీజేపీ నేతలు ఇప్పుడు నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణకు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. సమావేశంలో కిరణ్, రెడ్డిశేఖర్, రమాదేవి, పుష్పసుధ, నీలకంఠం, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నృత్య, నాటకోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి కళోత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు తలపెట్టిన నృత్య, నాటక కళోత్సవాలు శనివారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను యూనివర్సిటీ విశ్రాంత డీన్ సర్వోత్తమరావు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ విభూషణ శర్మ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోము రవికుమార్ అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఎలాంటి స్వలాపేక్ష లేకుండా నిరంతరం శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు కస్సా పద్మనాభన్ కళా తృష్ణతో నృత్య, నాటక కళలను ప్రదర్శిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సోము రవికుమార్, రాజేంద్రరెడ్డి, సర్వోత్తమరావు, జయరాంప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఎస్.రాజా, జీఎస్. కోటేశ్వరరావు, సిద్దేంద్ర శర్మ, రవి, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీపద్మావతి కల్యాణం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

బెల్ట్‌షాపులపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి : బెల్ట్ దుకాణాలలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు చేశారు. సాక్షి దినపత్రికలో 'విచ్చలవిడిగా బెల్టుషాపులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు బెల్ట్‌షాపులపై దాడి చేసి ఎర్రావారిపాళెం మండలం కుమ్మరపల్లెకు చెందిన నారాయణ, చిన్నగొట్టిగల్లు మండలం మారసానివారిపల్లెకు చెందిన సహదేవయ్య, చంద్రగిరి కొత్తపేటకు చెందిన ముబారక్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి 37 మద్యం సీసాలను స్వాధీన చేసుకున్నారు.ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఫణీంద్ర తెలిపారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

పాకాల : కార్తీక పౌర్ణమి పూజలలో భాగంగా సూరినేనివారిపల్లి గ్రామంలోని గుర్రప్పస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. శనివారం ఈ మేరకు మాహన్యాస పూర్వ ఏకాదశి రుద్రాభిషేకం జరిపించారు. సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బుజ్జిబాబునాయుడు, ఉభయకర్తలు కుమారస్వామి నాయుడు, నరేంద్ర, రమ, మునిరత్నంనాయుడు, బాలాజీశెట్టి, సుధాకర్ పాల్గొన్నారు.

రాంగ్ రూట్ జర్నీ!

- శ్రీనివాససేతుపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీనివాస సేతు వంతెనపై పలువురు రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లలో వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి చేరుకుంటున్నారు. తర్వాత బస్టాండ్‌లో వారి బంధువులు, మిత్రులను వదిలిపెట్టిన తర్వాత అదేమార్గంలో రాంగ్‌రూట్ అయినా నిర్లక్ష్యంగా వెళ్లిపోతున్నారు. సాధారణంగా వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి ఆర్టీసీ సర్వీసులు మాత్రమే వెళ్లాలని నిబంధనలున్నాయి. అయినప్పటికీ పలువురు వాహనదారులు పాటించడం లేదు. ఇప్పటికే పలుసార్లు చిన్నపాటి ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. మరోవైపు బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య తెలిసిందే. ప్రధానంగా రాత్రి సమయంలో బస్టాండ్‌లో నుంచి బస్సు బయటకు రావడానికి 30 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. ట్రాఫిక్ నియంత్రించాల్సిన ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం వల్లే, పలువురు శ్రీనివాస సేతుపై నుంచి రాంగ్ రూట్‌ను ఎంచుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వాల తీరు సరికాదు

తిరుపతి కల్చరల్ : ప్రస్తుత ప్రభుత్వాల తీరు సరికాదని, ప్రజల మధ్య వైషమ్యాలను పెంచి పోషిస్తున్నాయని భారతీయ సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బైరాగిపట్టెడలోని పిల్లపాళెం, వాసుదేవరెడ్డి లైబ్రరీ మెమోరియల్ హాల్లో ఇస్కఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల మతాల నడుమ కలహాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిని జైల్‌లో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాల వైఖరి మారకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇస్కఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇస్కఫ్ అధ్యక్షుడు డి.రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడు కర్లపూడి గోవిందస్వామి, కార్యదర్శి చిన్నం కాళయ్య, ఆర్.బలరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్